
నిలువెత్తు నిర్లక్ష్యం..

- నీటి వనరులను పట్టించుకోని గత ప్రభుత్వం
- మరమ్మతులకు నోచుకోని 100కు పైబడి చెరువులు, కుంటలు, కాలువలు
- వర్షాకాలం వస్తున్నా కన్నెత్తి చూడని అధికారులు
- వరదనీరు వచ్చినా నిల్వచేసే పరిస్థితి లేదు
- బీడుగా మారనున్న ఆయకట్టు భూములు

రాజంపేట, సెప్టెంబరు 2: మాది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వ పాలకులు నీటి వనరులను పట్టించుకోలేదని, చెరువుల కింద ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా ఉన్నా తమను గత పాలకులు ఆదుకోలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. మామూలుగా ఈపాటికే చెరువులు, కుంటలు, కాలువల్లో పేరుకుపోయిన కంపచెట్లను, పూడికతీతలను తొలగించి వేయాలి. ప్రధానంగా వర్షపు నీరు రావడానికి చెరువులకు నీరందించే కాలువల్లో పూడికలు తీసి అడ్డంగా ముళ్లచెట్లను తొలగించాలి. ఆయకట్టు భూములకు నీరందించే తూములకు మరమ్మతులు చేసి వర్షాకాలంలో గేట్లు ఎత్తడానికి అనువుగా ఉంచాలి. ఎక్కడైనా చెరువుల వద్ద కట్టలపై గండ్లు పడి ఉంటే వాటిని పూడ్చాలి. అటువంటిది సంబంధిత ఇరిగేషన్ అధికారులు గత ప్రభుత్వంలో పనిచేసిన విధంగానే ఈ ప్రభుత్వంలో కూడా ఇంతవరకు చెరువుల గురించే పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో చెరువులు, కుంటలు, కాలువులకు పెట్టింది పేరు. ఈ రెండు నియోజకవర్గాల్లో సుమారు వందకు పైబడి చెరువులు, కుంటలు, ఊట కాలువలు ఉన్నాయి. వీటి కింద సుమారు లక్ష ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. వర్షాలు కురిసే సమయానికి అతి తక్కువ ఖర్చుతో ఈ చిన్న నీటి వనరులపై ఖర్చు చేసి పూడికతీతలు, మరమ్మతులు, కంపచెట్లు తొలగిస్తే పుష్కలంగా వరద నీరు చెరువులు, కుంటల్లోకి చేరి ఆయకట్టు భూములన్నీ సాగవుతాయి. అయితే ఇంతవరకు సంబంధిత శాఖాధికారులు వీటి గురించి పట్టించుకున్నా పాపానపోలేదు. రాజంపేట ప్రాంతంలో ప్రతి ఏడాది 720 సెం.మీ వర్షపాతం నమోదవుతుంది. అటువంటి వాతావరణ పరిస్థితుల్లో మార్పుల వల్ల మూడేళ్ల కిందట పడిన వర్షం మినహా సగటు వర్షపాతం కూడా ఇక్కడ నమోదు కాలేదు. గత ఏడాది పూర్తిగా వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలకు నీరందక భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా మారాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో చెరువులు, కుంటలు, కాలువలను తక్కువ ఖర్చుతో రిపేర్లు చేసుకుంటే సుమారు లక్ష ఎకరాల ఆయకట్టు భూమి పంటలతో సస్యశ్యామలం కానుంది.



మరమ్మతులకు నోచుకోక ఉనికినే కోల్పోయిన తాళ్లపాక ఊటకాలువ



మొక్కలతో నిండిపోయిన పోలిచెరువు ఆయకట్టు కాలువ

పోలి, ఇతర చెరువులపై నిర్లక్ష్యం

ప్రధానంగా రాజంపేట పట్టణానికి కేవలం కిలోమీటరు దూరంలో పోలి చెరువు ఉంది. ఈ చెరువు 1600 ఎకరాల ఆయకట్టు భూమికి పుష్కలంగా నీరు అందిస్తుంది. పుల్లంగేరు ద్వారా పోలి చెరువుకు నీరందుతుంది. అయితే పుల్లంగేరు నుంచి పోలి చెరువుకు నీరు అందే సమయంలో అక్కడున్న గేట్లను మరమ్మతు చేస్తే వర్షం వచ్చిన సమయంలో వరదనీరు చెరువుకు అందడానికి.. అధికంగా వరదనీరు వస్తే చెరువు పొర్లకుండా ఉండడానికి పుల్లంగేరు వద్ద ఉన్న గేట్లు ఎంతో ప్రధానమైనవి. ఈ గేట్లను ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. అదేవిధంగా చెరువుకు అతిపెద్ద తూము ఉంది. ఈ తూము ద్వారా 1600 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తారు. అటువంటి తూము గేటును ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. ఆ తూము గేటు ముళ్లచెట్లతో పూడికలతో పూడిపోయి ఉంది. రాజంపేట పట్టణానికి చుట్టుపక్కల ఊటుకూరు, మన్నూరు, తాళ్లపాక, హస్తవరం చెరువులు ఉన్నాయి. మండలంలో 20కి పైబడి చెరువులు ఉన్నాయి.

చిట్వేలి మండలంలో సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే యల్లమరాజుచెరువు ఉంది. అదేవిధంగా చిట్వేలి మండలంలో నగరిపాడు, నాగవరం, మైలపల్లె, రాజుకుంట చుట్టుపక్కల 10 చెరువులు ఉన్నాయి. ఓబులవారిపల్లె మండలంలో సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే పెద్దఓరంపాడు చెరువు ఉంది. ఆ చెరువుతో పాటు రెడ్డిపల్లె ఇతర అనేక చెరువులు ఉన్నాయి. ఒంటిమిట్ట మండలంలో రూ.36 కోట్లతో శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు నీరందించి రెండు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉండగా శ్రీరామ ఎత్తిపోతల పథకం మెయింటెనెన్స్‌కు సరిపడా డబ్బులు ఖర్చు చేయలేక జగన్ ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఒంటిమిట్ట చెరువులో చుక్కనీరు లేదు. నందలూరు మండలంలోని నందలూరు, లేబాక, టంగుటూరు, పొత్తపి, చుట్టుపక్కల ప్రాంతంలో అనేక చెరువులు ఉన్నాయి. ఈ విధంగా అనేక చెరువులు పూడికలకు నోచుకోక తూములు రిపేర్లకు నోచుకోక భారీ వర్షాలు పడ్డా వరద నీటిని నిల్వ ఉంచుకుని ఆయకట్టు భూములకు నీరందించే పరిస్థితి కనుచూపు మేరలో కానరావడం లేదు.

ఊసురోమంటున్న ఊట కాలువలు

రాజంపేట నియోజకవర్గంలోని చెయ్యేరు నది పరీవాహక ప్రాంతం ద్వారా నందలూరు, పెనగలూరు, రాజంపేట మండలాల్లో 20 ఊట కాలువలు ఉన్నాయి. కేవలం పైసా ఖర్చులేకుండా చేతితో ఇసుకమేటలను తొలగించుకుని కంపచెట్లు తొలగిస్తే వర్షాకాలంలో ఈ ఊట కాలువల ద్వారా 20 వేల ఎకరాల ఆయకట్టు భూమి సాగవుతుంది. గతంలో చెయ్యేరు నది ఆధారంగా ఈ ఊట కాలువల్లో ఏడాది పొడవునా ఊటనీరు వచ్చి 3 కార్లు పుష్కలంగా పండేవి. నారాయణనెల్లూరు ఎగువ, దిగువ కాలువలు, టంగుటూరు, లేబాక, పెనగలూరు, తాళ్లపాక, అత్తిరాల, మందరం, నందలూరు, మందపల్లె, పులపత్తూరు, తొగురుపేట, రామచంద్రాపురం, పొత్తపి, జెట్టివారిపల్లె ఇలా అనేక గ్రామాలకు చెయ్యేరు నది ద్వారా ఈ ఊటకాలువలు నది ఏర్పడినప్పటి నుంచి ఉన్నాయి. గతంలో వర్షాకాలంలో ఈ కాలువలను పూడికతీసి కంపచెట్లు తొలగిస్తే 20 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఇప్పుడు ఊటకాలువల గురించి పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఈ ఊటకాలువలు నిర్వీర్యంగా మారి ఆయకట్టు భూమి బీడుగా మారింది.

గుంజనేరు ద్వారా చెక్‌డ్యాంలపై నిర్లక్ష్యం

తిరుమల గిరుల నుంచి కుంజరి నదిగా పిలువబడి కోడూరు నియోజకవర్గంలో గుంజనేరుగా ప్రవహించే నదికి కోడూరు, చిట్వేలి, పెనగలూరు మండలాల్లో అనేకచోట్ల సుమారు 20 చోట్ల పైబడి చెక్‌డ్యాంలను నిర్మించారు. ఈ చెక్‌డ్యాంలను ద్వారా సమీప చెరువులకు ప్రత్యేక కాలువలను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తారు. ఈ నది ద్వారా 20 చెరువులకు అనేక ఊటకాలువలకు పుష్కలంగా నీరు అంది 30 వేల ఎకరాల ఆయకట్టు పండుతుంది. అయితే ఈ చెక్‌డ్యాంల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో చెరువులకు, కాలువలకు నీరందక ఆ ప్రాంత ఆయకట్టు భూములు బీళ్లుగా మారుతున్నాయి. ఈ స్థితిలో వీటిని వినియోగంలోకి తెచ్చి లక్ష ఎకరాల ఆయకట్టు భూమిని పండించాల్సిన బాధ్యత నేటి నేతలపై ఉంది.

పోలి చెరువు తూమును రిపేరు చేయండయ్యా..



పోలి చెరువు 1600 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తుంది. ఈ 1600 ఎకరాలకు నీరందించేది ఒకే తూమే. ఆ తూము గేటును ఇంతవరకు పట్టించుకున్నవారు లేరు. చెరువులోకి నీరు వస్తే ఈ తూము గేటు ఎత్తడం, దించడం చాలాకష్టంతో కూడుకున్న పని. గతంలో ఈ తూము గేటును మరమ్మతు చేయకపోవడంతో ఆయకట్టు భూములకు నీరందలేదు. ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. ఈ పోలిచెరువు తూము గేటు వెంటనే రిపేరు చేయాలి. ఈ తూము వద్ద వెంటనే పూడికతీసి కంపచెట్లను తొలగించి వర్షాకాలంలో చెరువులోని నీరు ఆయకట్టు భూములకు అందేవిధంగా చేయాలి. ఇంతవరకు ఇరిగేషన్ అధికారులు పోలిచెరువు గురించి పట్టించుకోకపోవడం దారుణం.

- గుండ్రాజు వెంకటరమణరాజు, పోలిచెరువు ఆయకట్టు రైతు, రాజంపేట

ఊటుకూరు చెరువుపై దృష్టి పెట్టండి..



రాజంపేట మండలంలో సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఊటుకూరు చెరువు గురించి ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవాలి. చెరువులో కంపచెట్లు, పూడికలు చేరి చెరువు మొత్తం పూడిపోయింది. భారీ వర్షాలు వస్తే చెరువు కట్టలు తెగి నీరంతా వృథాగా పోతోంది. గతంలో అనేకసార్లు ఈ చెరువు కట్టలు తెగిపోయి నీరంతా వృథాగా పోయి ఆయకట్టు భూమి బీడుగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి ఊటుకూరు చెరువులో పూడికలు తీయించి కాలువల్లో కంపచెట్ల తొలగించి గేట్లు రిపేరు చేయించాలి.

- మలిశెట్టి సుబ్బరాయుడు, చెరువు ఆయకట్టు రైతు, రాజంపేట

ఊటకాలువలను వినియోగంలోకి తేవాలి..



పెనగలూరు మండలంలోని నారాయణనెల్లూరు గ్రామంలో చెయ్యేరు నది ఆధారంగా 2 ఊట కాలువలు ఉన్నాయి. ఎగువ, దిగువ ఊటకాలువల కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. గతంలో ఈ కాలువల ద్వారా చెయ్యేరు నుంచి మూడు కార్ల పంటలకు కావాల్సిన నీరు అంది పుష్కలంగా పంటలు పండేవి. ఇప్పుడు ఈ కాలువలను అనేకమంది ఆక్రమించేసి పూడ్చి వేశారు. అనేక చోట్ల కంపచెట్లు ఎక్కువై కాలువలు కనిపించకుండాపోయాయి. కంపచెట్లతో పాటు పూడికలు ఉండడం వల్ల కాలువలన్నీ చుక్కనీరు రాకుండా వాటి ఉనికినే కోల్పోయాయి. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఈ కాలువలను తిరిగి గుర్తించి పూడికలు తీయించి దెబ్బతిన్న కాలువలను ఏర్పాటు చేసి ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది.

- పలుకూరు ఉగ్రరవీంద్ర, నారాయణనెల్లూరు ఊట కాలువల ఆయకట్టు రైతు, పెనగలూరు



పూడికలు తీయక నిరుపయోగంగా ఉన్న పోలిచెరువు తూము

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు



వైసీపీకి ఓట్లు వేయలేదని
రస్తా మూసేశారు

- వైసీపీ నాయకులకు వ్యతిరేకంగా గ్రామస్తుల ధర్నా

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 2: గత ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేయలేదని ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఎంతో కాలంగా ఉన్న బండ్ల రస్తాను మూసివేశారని దిగువగొట్టివీడు గ్రామం జంగంపల్లి గ్రామ ప్రజలు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామం జంగంపల్లెకు పక్కనే గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామం ఉంది. ఈ గ్రామంలో జంగంపల్లె వాసులకు చెందిన 100 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఆ భూముల్లో వ్యవసాయం చేయడానికి జంగంపల్లి నుంచి తమ భూముల్లోకి వెళ్లడానికి పూర్వం నుంచి బండ్ల జాగా ఉండేదని, ఎన్నికల్లో వైసీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ఓట్లు వేయలేదని ఆయన అనుచరులు సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, మరికొందరు కలిసి రస్తాను మూసివేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పొలాల్లోకి వెళితే మీ అంతు చూస్తాం అని బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం ముందు నినాదాలు చేశారు. నిరసన అనంతరం జంగంపల్లి ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని గ్రామస్తులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి దృష్టికి కూడా తీసుకెళ్లారు. దారి విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్‌కు చెప్పినట్లు తెలిసింది. కార్యక్రమంలో గ్రామస్తులకు మద్దతుగా టి.ఈశ్వర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రామాంజులు, పల్లం తాతయ్య, జంగంపల్లి గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై శ్రద్ధ చూపాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 2: ప్రజల సమస్యలపై శ్రద్ధ పెట్టి బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. అందిన ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు వంద శాతం పరిష్కరించాలని తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోని అధికారులందరూ ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి అవగాహన చేసుకుని వారి సమస్యపై క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిష్కరించాలన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా సోమవారం అర్జీదారులు భారీగా తరలివచ్చి వారి సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణ, ఎస్‌డీసీ వెంకటసుబ్బయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, అధికారులు

గురుకుల పాఠశాలలో దారుణం

- బాలికపై లైంగిక వేధింపులు
- అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఘటన
- నిందితుడు పాఠశాల ప్రిన్సిపాల్ భర్త
- ప్రిన్సిపాల్ భర్తపై పోక్సోతో పాటు ఎస్సీ, ఎస్టీ, కేసుల నమోదు
- బాలిక తల్లిదండ్రులను పరామర్శించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



నిందితుడు బాలసుబ్బయ్య



లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 2: లక్కిరెడ్డిపల్లెలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బాలికపై ప్రిన్సిపాల్ భర్త లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో పాఠశాలలోని విద్యార్థినులు సోమవారం తరగతులకు వెళ్లకుండా ధర్నాకు దిగి నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాఠశాలకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆమె భర్తపై పోక్సోతో పాటు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని మంత్రి, కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పరిమళ అనే ప్రిన్సిపాల్ ఎఫ్ఏసీగా పనిచేస్తోంది. ఆమె పాఠశాల ఆవరణంలోని క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటోంది. ఆదివారం అర్ధరాత్రి ప్రిన్సిపాల్ భర్త బాలసుబ్బయ్య హాస్టల్‌లోకి వెళ్లి 5వ తరగతి చదువుతున్న విద్యార్థినిని దగ్గరకు పిలిచి లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని ఎక్కడైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆ బాలిక భయంతో ఎవరికీ చెప్పకుండా ఉండిపోయింది. ఈ విషయాన్ని తోటి బాలికలు గుర్తించి రాత్రి డ్యూటీలో ఉన్న టీచర్‌కు తెలపగా ఆమె వెంటనే బాలికను విచారించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ బాలికలను పిలిపించి ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే మీకు టీసీలు ఇచ్చి పంపిస్తానని బెదిరించింది. అనంతరం ఈ విషయం ఎలాగో బయటపడటంతో విద్యార్థినులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. అక్కడికి వెళ్లిన విలేకరులకు విద్యార్థినులు తమ బాధను చెప్పుకున్నారు. గతంలో ఇక్కడ ఉన్న ప్రిన్సిపాల్ కమలాపురానికి బదిలీపై వెళ్లడంతో దీంతో ఇక్కడ సీనియర్‌గా ఉన్న పరిమళకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారని, ఆమె బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థినులను వేధింపులకు గురి చేస్తోందని వాపోయారు. ప్రిన్సిపాల్ భర్త బాలసుబ్బయ్య చిన్న కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ రాత్రి అయ్యేసరికి ఫుల్‌గా మద్యం తాగేవాడని, అతడితో పాటు మరో ముగ్గురిని పాఠశాలలోకి పిలిపించుకుని ఇక్కడే మద్యం తాగుతారని తెలిపారు. అంతేకాకుండా వారు మద్యం తాగడానికి తమ చేత తినుబండారాలను కూడా ప్రిన్సిపాల్ తెప్పించి తన భర్తకు ఇచ్చేదని వాపోయారు. ఉదయం 10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులు స్నానాలు చేసేటప్పుడు లోపలికి వచ్చి చూసేవాడని, ఆడపిల్లలను ఫొటోలు, వీడియోలు తీసి బెదిరించేవాడని ఇంటర్ విద్యార్థినులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఈవోలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి పాఠశాలకు చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు నచ్చచెప్పినా వారు వినకుండా వెంటనే ప్రిన్సిపాల్‌ను తొలగించాలని, ఆమె భర్తను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రామాపురం, లక్కిరెడ్డిపల్లె ఎస్ఐలు రవీంద్రబాబు, సుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థినులకు నచ్చచెప్పి తరగతి గదుల్లోకి పంపించారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శ

బాలికపై జరిగిన సంఘటన విషయం తెలిసిన వెంటనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి వెళ్లి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఉన్న బాలికను పరామర్శించి బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా ఆదుకుంటామని, బాలికకు లక్ష రూపాయలు ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడారు. పరిమళ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యార్థినులు, ఉపాధ్యాయులకు నరకం చూపిస్తోందని వాపోయారు. మాకు రావాల్సిన గుడ్లు, చిక్కీ, కాస్మొటిక్ ఫీజు, మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా ఆమె ఇంటికి సరుకులన్నీ తరలిస్తోందని, ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే టీసీలు ఇచ్చి పంపిస్తానని బెదిరిస్తోందని మంత్రికి తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విషయాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి తెలియచేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేద విద్యార్థుల కడుపుకొడుతున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేసి ఆమె భర్తపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లె పోలీసులు పోక్సోతో పాటు ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

పోక్సో కేసు నమోదు చేయండి : కలెక్టర్

కలెక్టర్ చామకూరి శ్రీధర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి సంఘటన గురించి విద్యార్థినులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బాలికల పాఠశాలలో ప్రత్యేక నిఘా పెట్టి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బాలికలు కలెక్టర్ ఎదుట భోరున విలపించారు. మాకు చాలా అన్యాయం జరుగుతోందని, ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు సార్.. వెంటనే ఆమెను తొలగించండని కోరారు. ప్రిన్సిపాల్ భర్తకు ఎవరైనా విద్యార్థినులు ఎదురెళితే వారి శరీరంపై ఎక్కడెక్కడో చేతులు వేస్తాడని, ప్రిన్సిపాల్ మా ఫొటోలు తీసి ఆమె భర్తకు పంపుతుందని, చాలా అసభ్యంగా ప్రవర్తిస్తోందని కన్నీటి పర్యంతమయ్యారు. స్నానం చేసే సమయంలో బాత్రూంలోకి వస్తాడని, భయభ్రాంతులకు గురి చేస్తాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ వెంటనే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా ఆమె మీద, ఆమె భర్త మీద పోక్సో కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ప్రిన్సిపాల్‌తో పాటు హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సెక్యూరిటీ గార్డు నాగలక్ష్మిలను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రంగస్వామి, డీసీవో మాధవీలత, అన్ని శాఖల అధికారులు ఉన్నారు.

భూవివాదాలపై ఫిర్యాదులే అధికం

- 108 మంది అర్జీలు విచారించిన సబ్‌కలెక్టర్



ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 2: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం కార్యక్రమంలో ప్రజల నుంచి అధికంగా భూవివాదాలకు సంబంధించి ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మదనపల్లె పట్టణ శివారు బైపాస్ రోడ్డు పక్కన ఉన్న స్వామిచెరువును కొందరు ఆక్రమించుకుని పక్కానిర్మాణాలు చేపట్టారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీలోని చింతలకుంటను కొందరు ఆక్రమించారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మదనపల్లె పట్టణంలోని కళాశాల హాస్టల్ వద్ద రౌడీమూకలు విద్యార్థినులను వేధిస్తున్నారని, ఇక్కడ పోలీసు పహారా పెట్టించాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు మాధవ్, గంగారాణి సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. మదనపల్లె మండలం మునగమాకులపల్లెలోని ఓ వీధిలో వర్షపు నీరు, మురుగునీరంతా దిగువన ఉన్న ఇళ్లలోకి వస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రామాచార్లపల్లె పల్లెలో కొనుగోలు చేసిన భూమిని సర్వే చేయాలని చలానా కట్టినా, ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియాకు ఫిర్యాదు చేసినా మండల సర్వేయర్, వీఆర్వోలు తాత్సారం చేస్తున్నారని బాధితులు మల్లెల మోహన్, కొప్పల వెంకటరమణ ఫిర్యాదు చేశారు.

లేఅవుట్లు వేసే వారు చలానా కడితే మూడు రోజుల్లోనే వెళ్లి సర్వే చేసే అధికారులు, సామాన్యుడు చలానా కడితే ఏడాది గడుస్తున్నా సర్వే చేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం 108 మంది సమస్యల పరిష్కారం కోసం సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

కడప (క్రైం), సెప్టెంబరు 2 : కడప నగరం సెవెన్‌రోడ్స్ సమీపంలోని జిలేబీ తయారీ దుకాణంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కడప వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉపేంద్రకుమార్ (24) కొన్నేళ్లుగా కడప సెవెన్‌రోడ్స్‌లోని జిలేబీ దుకాణంలో పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఎవరూ పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం దుకాణంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి ఆ మేరకు అతని బంధువులకు సమాచారం అందించినట్లు తెలిపారు. తన కుటుంబ సభ్యులు పట్టించుకోవడంలేదని అందుకే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఆత్మహత్యకు ముందు లెటరు రాసినట్లు తెలిపారు.

ఘర్షణలో ఆరుగురికి గాయాలు

సికెదిన్నె, సెప్టెంబరు 2: ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఆరుగురికి గాయాలైనట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. తమ కొడుకును సినిమాల పేరుతో తిప్పి చెడగొడుతున్నారని ఆదివారం చింతకొమ్మదిన్నె మండలం నర్సన్నపల్లెకు చెందిన వీరంరెడ్డి శివశంకర్‌రెడ్డి భార్య లక్ష్మీదేవి వీరంరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను తిట్టడంతో గొడవ ప్రారంభమైంది. ఈ గొడవలో వీరంరెడ్డి వెంకటరామిరెడ్డి, వీరంరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వీరంరెడ్డి చిన్నసుబ్బారెడ్డితోపాటు వీరంరెడ్డి శంకర్‌రెడ్డి, నరసింహారెడ్డికి గాయాలయ్యాయన్నారు. వారిని ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు



రోడ్డుపై పడిఉన్న క్షతగాత్రులు

కాశినాయన సెప్టెంబరు 2: ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. బద్వేలు కోట వీధికి చెందిన కొందరు సోమవారం జ్యోతి క్షేత్రం నుంచి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కేతి బోయిన వెంకటయ్య కాలు విరగగా కోళ్ళ శీను, కోళ్ళ రమణయ్యకు రక్తగాయాలు అయ్యాయి. ఆ మార్గంలో వెళ్తున్న అంబేద్కర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్ 108 సమాచారం ఇచ్చారు. వారు సకాలంలో స్పందించకపోవడంతో కాశినాయన మండల పోలీసులకు, కడప డీఎంహెచ్‌వోకు సమాచారం ఇచ్చారు. సంఘటన జరిగి దాదాపు 2గంటల తర్వాత 108 వాహనం రావడంతో క్షతగాత్రులను పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం మత్తు మూలంగానే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితులు, ఎర్రచందనం దుంగలు, పట్టుబడిన వాహనాలతో ఫారెస్టు అధికారులు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 2 : అక్రమంగా తరలిస్తున్న ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు ఆఫీసరు శేషయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సోమవారం తెల్లవారుజామున బద్వేలు అటవీ రేంజి పరిధిలోని లోతువంక బీట్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ఆటో, ఒక కారు ఒకదాని వెనుక ఒకటి వచ్చాయి. వాటిని ఆపి తనిఖీ చేయగా కారులో ఐదు ఎర్ర చందనం దుంగలు పట్టుబడ్డాయి. కారు డ్రైవరు పారిపోగా, ఆటోలో ఉన్న చిత్తూరుకు చెందిన రేవంత్ బాబు, తమిళనాడుకు చెందిన శేఖర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరు రూట్ క్లియరెన్స్ చేసేందుకు కారుకంటే ముందుగా వచ్చినట్లు విచారణలో తేలిందన్నారు వీరికి కేరళ చెందిన ఎర్రచందనం స్మగ్లరు నాసర్‌భాయితో సంబంధాలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, సెప్టెంబరు 2: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని జలాశయ డీఈఈ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. పెన్నానదికి 400 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 50 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 60 క్యూసెక్కుల మేర నీరు వదులుతున్నామని పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గండికోట జలాశయం నుంచి 2,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 6.500 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో 5.240 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

చేపల వేటకు లైసెన్స్ తప్పనిసరి

కొండాపురం, సెప్టెంబరు 2: జిల్లాలోని గండికోట, సోమశిల వెనుక జలాలు, బ్రహ్మసాగర్ రిజర్వాయర్లలో చేపల వేటకు లైసెన్స్ తప్పనిసరి అని జిల్లా ఉప మత్స్య సంచాలకులు కె.శాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 వ తేదీ నుంచి జలాశయంలో వేటాడే ప్రతి మత్స్యకారుడు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ద్వారా లైసెన్స్‌లు పొందాలన్నారు. లేకుంటే ఏపీ ఫిషరీస్ రూల్స్ 1995 ప్రకారం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ముగిసిన బీఈడీ పరీక్షలు



బీఈడీ పరీక్షలను తనిఖీ చేస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 2 :వైవీయూ బీఈడీ సెమిస్టరు పరీక్షలు సోమవారం ముగిశాయి. గత నెల 27న జిల్లాలో 16 కేంద్రాల్లో ప్రారంభమైన ఈ పరీక్షలకు 4,062 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడప నగరంలో ఎస్వీ బీఈడి కాలేజీ, శ్రీహరి డిగ్రీ కళాశాల, లేవాకు నారపరెడ్డి బీఈడీ కళాశాల, భరత్ బీఈడీ కాలేజీ కేంద్రాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్లు రఘునాథరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు.

మరమ్మతులు చేయించండి.. మహాప్రభో..!

- కూలడానికి సిద్ధంగా తరగతి గదులు
- బిక్కు బిక్కు మంటూ విద్యార్థులు
- బురదలో నరకయాతన
- నిర్లక్ష్యంతో ఆగిన నాడు-నేడు పనులు
- పాఠశాల భవనం ప్రారంభించాలని తల్లిదండ్రుల వినతి



సింహాద్రిపురం, సెప్టెంబరు 2: స్థానిక జడ్పీ హైస్కూల్ తరగతి గదులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వర్షం కురిసిందంటే పాఠశాల పైకప్పు నుంచి వర్షపు నీరు కారడం, గోడలు నెమ్మెక్కి పెచ్చులూడిపడుతున్నాయి. దీంతో గోడలు ఎక్కడ కూలిపోతాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతున్నారు. వర్షం కురిసిందంటే పాఠశాల ఆవరణ అంతా బురదమయమై నడిచేందుకు కూడా విన్యాసాలు చేయాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో నడవలేక కిందపడిపోయే పరిస్థితులున్నాయి. వర్షం కురిసినపుడు తరగతి గదుల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. పాఠశాలలో వున్న 360 మంది విద్యార్థులు ఎక్కడ కూర్చుని చదువుకోవాలో అర్థం కాని పరిస్థితి. త్వరితగతిన పాఠశాలను నూతన భవనంలోకి మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజా ప్రతినిధులను, సంబంధిత ఉన్నతాధికారులను కోరుతున్నారు.



బీటలువారిన తరగతి గది గోడలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వర్షం కురిస్తే పాఠశాలలో విద్యార్థులకు కలిగే ఇబ్బందులపై తహసీల్దార్, ఎంపీడీఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలకు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాల్సివుంది.

\- హెచ్‌ఎం ఉమామహేశ్వరమ్మ

నిధుల లేమితోనే..

నిధుల లేమితోనే భవన నిర్మాణం ఆగి పోయింది. తగిన నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తే విద్యార్థులకు సురక్షితంగా ఉంటుంది. పాఠశాల దుస్థితిని గతంలో ఉపాధ్యాయులు నా దృష్టికి తెచ్చిన మాట వాస్తవమే.

\- ఎంపీడీఓ కృష్ణమూర్తి

ప్రజా దర్బార్‌కు పోటెత్తిన ప్రజలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. గతంలో ప్రజల సమస్యలు పరిష్కారం కాక ఎన్నో కష్టాలు, కన్నీళ్లతో కాలం వెళ్లదీసిన బాధితులకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ బాధితులకు భరోసానిస్తోంది. ఉదయం 6 గంటల నుంచి మంత్రి ప్రజల అర్జీలు స్వీకరించారు. వందల సంఖ్యలో వస్తున్న ప్రజలను చిరునవ్వుతో పలకరిస్తూ అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, అనంతపురం జిల్లాల వారు కూడా అర్జీలు సమర్పించారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

భూ సమస్యలపై ఫిర్యాదులు పునరావృతమైతే చర్యలు: కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 2: భూ సమస్యలపై ఫిర్యాదులు పునరావృతమైతే చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బాధితులు తరలిరావడంతో ..తమ గోడును చెప్పుకునేందుకు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. కలెక్టర్ వేదిక పైకి రాగానే ఒక్కసారిగా అందరూ ఎగబడడంతో, వారిని అదుపు చేసేందుకు సిబ్బంది తల ప్రాణం తోకకు వచ్చినట్లు అయింది. అప్పటికే డీఆర్‌ఓ, ఎస్‌డీసీ వినతులు తీసుకునేందుకు సిద్ధంగా వున్నా , అర్జీదారులు కలెక్టర్‌కు మాత్రమే అర్జీలు ఇస్తామని మొండికేశారు. గతంలో ఇచ్చిన అర్జీలకు ఇంతవరకు సమాధానం లేదంటూ కొందరు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. చిన్నబిడ్డ తల్లులు కూడా గంటల తరబడి క్యూలో నిలబడి తమ అర్జిని కలెక్టర్‌కే ఇవ్వాలని ఎదురుచూశారు. అర్జీదారుల బాధలు విన్న కలెక్టర్ మండలాలలో అధికారులు తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు మళ్లీమళ్లీ రావడం చూసిన కలెక్టర్ కింది స్థాయి సిబ్బందికి చురకలంటించారు. గతంలో జరిగిన అవినీతి, భూ అక్రమాలు పునరావృతం అయితే సహించేది లేదన్నారు. సోమవారం అందిన ఫిర్యాదుల్లో 80 శాతం భూ సమస్యలేనని అధికారులు తెలిపారు. మదనపల్లి సబ్‌డివిజన్ నుంచి ఎక్కుగా ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.



క్యూలో నిలబడిన అర్జీదారులు

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం : సీపీఐ

- ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

బద్వేలు, సెప్టెంబరు 2: ధరలను అదుపు చేయలేని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల తీరు నిరసిస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో మెడలో కూరగాయల దండలు వేసుకుని గ్యాస్ సిలిండర్లు పెట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ పేదల ఆదాయం పెరగకుండా, ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారుతోందన్నారు. ధరలు తగ్గింపు హామీలు కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితమయ్యాయన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులను ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కేవలం బియ్యంతో సరిపెట్టుకుంటున్నాయన్నారు. మోడీ సర్కార్ పెట్టుబడిదారుల అడుగులకు మడుగులొత్తుతోందే తప్ప ప్రజా జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏమాత్రం ప్రయత్నించడం లేదని ఆరోపించారు. ఒకవైపు కొత్త రేషన్‌కార్డుల మంజూరును జనాభా లెక్కలతో ముడిపెడుతూ మరోపక్క రేషన్‌కార్డులు కుదించే యోచనలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారం చేపట్టిన 100 రోజులలో ధరలు తగ్గిస్తామంటూ 2014 ఎన్నికలకు ముందు నరేంద్రమోడీ ఇచ్చిన హామీలు పదేళ్లు దాటినప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి ఇమ్మానుయేల్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీర శేఖర్, మస్తాన్, పెంచలయ్య, వీరమ్మ, హరికృష్ణ తదితయులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

శ్రీరామ ఎత్తిపోతల పథకంతో సాగు నీరందిస్తాం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 2: శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు రెండు రోజుల్లో నీరు అందిస్తామని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. మండలంలోని కుడమలూరు గ్రామంలో రైతులు టీడీపీ నాయకులతో కలిసి శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. పైపులైనుకు మరమ్మతులు చేయించారు. సోమవారం ఆయకట్టుకు నీరు విడుదల చేసేందుకు విద్యుత్ సమస్య ఏర్పడడంతో, 24 గంటల్లో సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు ఆయన సూచించారు. ఇందుకు సహకరించని విద్యుత్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం చెరువుకు నీరు విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ వాసుదేవరెడ్డి, టీడీపీ నాయకుడు కొమరా వెంకటనరసయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, చమర్తి మహేష్‌రాజు, మోదుగుల నరసింహులు, శివారెడ్డి, హరినాథ్ రెడ్డిలు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, నాయకులు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భారీ విరాళాలు

చిట్వేలి, సెప్టెంబరు 2: మండల పరిధిలోని స్తంభాల రాయుడుస్వామి ఆలయం సమీపంలో నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి భక్తులు సోమవారం 38.86 లక్షల భారీ విరాళాలను అందించినట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు తెలియజేశారు. నందలూరు మండలం ఆడపూరుకు చెందిన పెనిగలపాటి నారాయణ, సతీమణి రుక్మిణమ్మ కుమారుడు రమేష్‌నాయుడు, కోడలు మహేశ్వరి వారి కుటుంబ సభ్యులు 10,00,116 రూపాయలు విరాళం అందజేశారు. గతంలో కూడా వీరు 10 లక్షల రూపాయలు అందజేశారు. రైల్వేకోడూరు మండలం కె.బుడుగుంటపల్లెకు చెందిన తిరుపతి మోహన్ సతీమణి కాంతమ్మ, కుమారుడు హరికుమార్, కోడలు సత్యవతి, మనవరాళ్లు హాసిని, మోనాలిసా కుటుంబ సభ్యులు 5,00,116 రూపాయలు, పుల్లంపేట మండలం పీవీజీ పల్లెకు చెందిన కిలారి నారాయణయ్య సతీమణి సావిత్రమ్మ, కుమారుడు వెంకటేశ్వరప్రసాద్, కోడలు సుభాషిణి, మనుమరాలు సుజశ్రీ, మనుమడు వర్షిత్ కుటుంబ సభ్యులు 5,00,116 రూపాయలు, చిట్వేలి మండలం గాంధీనగర్‌కు చెందిన బత్తల వెంకటసుబ్బయ్య సతీమణి నారాయణమ్మ, కుమారుడు హరీష్, కోడలు భవాని, కుటుంబ సభ్యులు 1,50,116 రూపాయలు, చిత్తూరు జిల్లా పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంకు చెందిన మోటుపల్లి రమేష్‌నాయుడు, సతీమణి ఝాన్సీరాణి, కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు, చిట్వేలి మండలం గుడ్లవారిపల్లెకు చెందిన పెనగలూరు నరసింహులు, సతీమణి విజయలక్ష్మీ కుటుంబ సభ్యులు 50,116, రాజంపేట మండలానికి చెందిన కే..శే. రేవూరు రామయ్య కుమార్తె చెన్నమ్మ కుటుంబ సభ్యులు 20,116, చిట్వేలి మండలం గాంధీనగర్‌కు చెందిన ఓబిలి సుబ్బయ్య సతీమణి రత్నమ్మ కుటుంబ సభ్యులు 15,116 రూపాయలు, మొత్తం 38,86,044 రూపాయలను భక్తులు విరాళాలుగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వామి కృపాకటాక్షం ఉండాలని ప్రార్థించారు.



రూ. 20 లక్షలు విరాళం అందించిన పెనిగలపాటి నారాయణ కుటుంబ సభ్యులు

డీసీసీ కార్యాలయానికి షర్మిల



పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను సన్మానిస్తున్న మైనార్టీ నేతలు

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 2: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇడుపుల పాయలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నానికి జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా కాంగ్రెస్ నేతలు అఫ్జల్ ఖాన్, విజయ జ్యోతి, శ్రీరాములు,మధు రెడ్డి, ఎస్.ఎ సత్తార్, బండి జకరయ్య ఇతర నాయకులు, కార్యకర్తలను పిలిపించి విడివిడిగామాట్లాడారు. అనంతరం పలువురు మైనార్టీ నేతలు, ఫార్మసిస్టులు సమస్యలు పరిష్కరించాలని ఆమెను కోరారు. కాగా, సోమవారం రాత్రికి డీడీసీ కార్యాయంలోనే బస చేసి 3వ తేదీన జిల్లా కలెక్టర్‌ను కలవనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బెంగళూరు బయలు దేరనున్నారు

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి'

- ర్యాలీలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

వేంపల్లె, సెప్టెంబరు 2: మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థి దశలో మత్తుకు బానిసలు అయితే బతుకు దుర్భరం అవుతుందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా.. వాటి బానిన అయితే కలిగేనష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలు జీవితంలో ఎలాంటి పురోగతి లేకుండా చేస్తాయని, ఇలాంటి వాటికి బానిసలైన ఎందరో జీవితాలను కోల్పోయారని తెలియజెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు మధుసూదన్‌రెడ్డి, ఇందుమతి, సుబ్బరాయుడు, గోవర్దన్, అకడమిక్ డీన్ రత్నకుమారి, క్యాంపస్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అవకతవకలపై ఫిర్యాదులకు కాల్ సెంటర్



టోల్ ఫ్రీ నెంబర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 2: గతంలో గృహ నిర్మాణ శాఖలో అవినీతి అక్రమాల, అవకతవకలపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా కార్యాలయంలో కాల్‌సెంటర్ (08561-293086)ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాల్ సెంటర్ ఉదయం 9:00 నుండి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తుందని జిల్లాలోని ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఆయా మండలాలకు వెళ్లి సమశ్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తాసుకోవాలని హౌసింగ్ పిడి శివయ్యను ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను అయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసి వెంకటసుబ్బయ్య, డీఆర్‌ఓ సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), సెప్టెంబరు 2 : జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సెప్టెంబరు 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎన్‌జీవోలు ప్రచురించిన మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల కరపత్రాలను ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీకి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను కోల్పోతున్నారన్నారు. మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా మంచి నడవడిక, నైతిక విలువలు పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదగాలని యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరాముడు, జూటూరు విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, భువనేశ్వర్‌రెడ్డి, సుభాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కిడ్నాపర్లపై చర్యలు తీసుకోవాలి

- ఎస్పీకి ఓ మహిళ వినతి

కడప (క్రైం), సెప్టెంబరు 2 : తన కూతురిని కిడ్నాప్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చక్రాయపేటమండలం అద్దాలమర్రికి చెందిన అన్నపూర్ణమ్మ సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన రెండో కుమార్తె(16)ను కిరణ్ అనే వ్యక్తి తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి గతంలో మాయమాటలు చెప్పి తీసుకుని వెళ్లగా, అప్పట్లో తన కూతురు తప్పిపోయిందంటూ చక్రాయపేట పోలీసు స్టేషన్‌లో తాను ఫిర్యాదు చేయగా వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారని తెలిపింది. తరువాత తన కూతురిని తీసుకురావడంతో పోలీసులు ఆమెను కడపలోని హోంలో కొంతకాలం ఉంచి తమకు అప్పగించారు. తన కుమార్తెను ఇంటికి తీసుకుని వచ్చిన మరుసటిరోజే మళ్లీ కిరణ్, తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి కిడ్నాప్ చేసి తీసుకుని వెళ్లారు. మరలా ఆచూకి తెలియరాలేదు. తన కుమార్తెను తమకు అప్పగించి నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ వెంకటరాముడు చక్రాయపేట పోలీసులతో మాట్లాడి వెంటనే నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

4న రాజీవ్ రైతు బజార్‌లో అవగాహన సమావేశం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2: ఈ నెల 4న బుధవారం ఉదయం 11 గంటలకు మదనపల్లి పట్టణంలోని రాజీవ్ రైతు బజార్‌లో రైతులు, ఫార్మర్స్ ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు) వ్యాపారులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి టీ. త్యాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లి పట్టణంలో రాజీవ్ రైతు బజారును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆగస్టు 27న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు రైతులు, ఫార్మర్స్ ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు), ఉద్యాన పంటలు, ఆకుకూరలు పండించే రైతులు, పూలు, పండ్లు, పచ్చిచేపలు, ఎండు చేపలు, రొయ్యల వ్యాపారులు తదితరులతో ఈ నెల 4న మదనపల్లి రాజీవ్ రైతు బజార్‌లో అవగాహన సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, మదనపల్లి మున్సిపల్ కమిషనర్, రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ తదితరులు రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటు రైతు బజారును పునఃప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తారన్నారు. కావున రైతులు, ఎఫ్‌పీవో సభ్యులు, వ్యాపారులు పాల్గొనాల్సిందిగా ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సుండుపల్లె, సెప్టెంబరు 2: అప్పన్నకుంటలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తహసీల్దార్ దైవాధీనం రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కుంటను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేయాలని వీఆర్‌వో జయలక్ష్మిని ఆదేశించారు. అనంతరం అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిని పిలిచి మాట్లాడారు. కుంటను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అప్పన్నకుంటలో నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.

సబ్‌కలెక్టర్‌కు టీడీపీ నేతల వినతి

రాజంపేట, సెప్టెంబరు 2: రాజంపేట, పుల్లంపేట మండలాల్లో అనేక చెరువులకు గండ్లు పడి ఉన్నాయని, వాటిని ఏ అధికారి పట్టించుకోవడం లేదని, ఆ అధికారులపై ఒత్తిడి తెచ్చి చిన్ననీటి వనరులకు మరమ్మతులు చేయించాలని పలువురు టీడీపీ నాయకులు సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. పుల్లంపేట మండలంలోని రాతిచెరువు, అనంతసముద్రం చెరువు, చిన్న చెరువు, వత్తలూరు చెరువు, రాజంపేట మండలంలోని ఊటుకూరు, ఇంకా అనేక చెరువులు పూడిక తీయలేదని, సప్లై ఛానల్‌కు పడ్డ గండ్లను పూడ్చలేదని, పాడైన రెగ్యులేటర్లకు మరమ్మతులు చేయించాలని విన్నవించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బరసయ్యనాయుడు, డీలర్ల సంఘం నాయకులు చుండు సుధీర్, ప్రభాకర్‌నాయుడు, పిచ్చిరెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


యువతకు సూచనలిస్తున్న ఎస్‌ఐ

పెనగలూరు, సెప్టెంబరు 2: మండల వ్యాప్తంగా వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పెనగలూరు ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి సూచించారు. సోమవారం సత్తుపల్లె హరిజనవాడకు చెందిన యూత్ సభ్యులు ఎస్‌ఐను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎ స్‌ఐ మాట్లాడుతూ చవితి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తగిన గుణపాటం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటేశ్, నేతగాని చిన్నయ్య పాల్గొన్నారు.

అన్యాక్రాంతంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

సుండుపల్లె, సెప్టెంబరు 2: విరూపాక్షస్వామి, చెన్నకేశవస్వామి, వసుకోటమ్మ మాన్యాలు అన్యాక్రాంతమవుతున్నాయని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు సోమవారం తహసీల్దార్ దైవాదీనంకు వినతిపత్రాన్ని అందజేశారు. కొంతమంది పలుకుబడి ఉన్న నాయకులు ఎర్రమట్టిని తోలుకొని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని, దేవాదాయశాఖ భూములను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షుడు గడ్డం మహదేవ, నాగలేసు, నాగేశ్వర, వీరనాగయ్య, ఎంఎస్‌పీ యువజన నాయకులు నాగలేసు తదితరులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్లకు బిల్లులు చెల్లించాలి: సీఐటీయూ


కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 2: క్యాబ్ డ్రైవర్లకు బిల్లులు చెల్లించకుండా గత 4 నెలలుగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం డ్రైవర్లతో కలిసి కలెక్టర్ గేటు ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు జరిగి దాదాపు 4 నెలలు కావస్తున్నా డ్రైవర్లకు బిల్లుల చెల్లింపులో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలన్నారు. మదనపల్లి డివిజన్‌లో దాదాపు 37 వాహనాలకు బిల్లులు చెల్లింపుకాక కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రైవర్ల బిల్లులు త్వరగా చెల్లించాలని కోరారు. ఈ విషయంపై డ్రైవర్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

స్వయం సహాయక సంఘాలకు
పొదుపే మూలం : వెలుగు ఏపీఎం

వీరబల్లి, సెప్టెంబరు 2: స్వయం సహాయక సంఘాలకు పొదుపులే మూలమని వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పెద్దివీడు హరిజనవాడకు చెందిన మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. పొదుపులు, రుణాల చెల్లింపులు సక్రమంగా జరిగే సంఘాలకు రుణాలు సకాలంలో అందిస్తున్నామని, బకాయిలున్న సంఘాలు పూర్తిగా రుణం చెల్లించగా కొత్త రుణాలు ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీసీ కృష్ణయ్య, వీఐఏ లక్ష్మిదేవి, సభ్యులు పాల్గొన్నారు.

'భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి'

గాలివీడు, సెప్టెంబరు 2: గత ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సోమవారం జరిగిన గ్రీవెన్‌సెల్‌లో తహసీల్దార్ భాగ్యలతకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుల అభిప్రాయం మేరకు వివరాల్లోకి వెళ్తే.. గాలివీడు గోరాన్‌చెరువు పంచాయతీలో చాలా వరకు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, ముఖ్యంగా గోరాన్‌చెరువు పంచాయతీలోని నల్లగుట్టలోని జగనన్న కాలనీలో అసలైన పేదవారికి ఇళ్లను మంజూరు చేయకుండా అనర్హులకు గృహాలను మంజూరు చేశారని ఆరోపించారు. కొందరు నిరుపేదలకు పట్టాలు ఇచ్చినప్పటికీ ఇంటి స్థలాలను ఇంతవరకు చూపించలేదని పేర్కొన్నారు. ఆక్రమణలకు గురైన చెరువులను, ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, రాము, శ్రీకాంత్‌రెడ్డి, రవినాయుడు, వెంకటాద్రి తదితర రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

వినాయకుని మండపాలకు
అనుమతులు తప్పనిసరి : సీఐ

నందలూరు, సెప్టెంబరు 2: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బహిరంగ ప్రదేశాల్లో వినాయకుని మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మన్నూరు సీఐ బీవీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పాటుకు సింగిల్ విండో విధానాన్ని తీసుకువచ్చినట్లు ఆయన అన్నారు. అందుకుగాను నంబరు 7995095800కు వాట్సాప్‌లో హాయ్ మెసేజ్ చేస్తే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఎస్పీని కలిసిన మందా శ్రీనివాసులు

రాజంపేట, సెప్టెంబరు 2: ఎస్పీని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా గల్ఫ్‌దేశంలో ఉన్న ఏజెంట్ చేతిలో, అరబ్‌ల చేతుల్లో మోసపోయిన మహిళను రప్పించేందుకు ఎస్పీతో మాట్లాడారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించి ఇంటిలిజెన్స్ పోలీసులకు రెఫర్ చేసి వెంటనే ఆమెను ఇండియాకు రప్పించేందుకు చొరవ చూపినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పవన్‌కళ్యాణ్ యువతకు ఆదర్శం

- పలుచోట్ల కూటమి నేతల అన్నదానం
- కేకు కట్ చేసి సంబరాలు





రాజంపేటలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ నిధియాదేవి, జనసేన నేత శ్రీనివాసరాజు, భారీ కేక్ కట్ చేస్తున్న జనసేన నేత అతికారి కృష్ణ, వీరబల్లిలో మొక్కలు నాటుతున్న బాలసుబ్రమణ్యం, టీడీపీ నాయకులు, రైల్వేకోడూరులో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, చిత్రంలో ముక్కా రూపానందరెడ్డి, నాగేంద్ర తదితరులు

> ఉప ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా పలుచోట్ల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మొక్కల పంపిణీ, రక్తదాన శిబిరం, అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

రాజంపేటటౌన్, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా నియోజకవర్గ జనసేనపార్టీ నాయకుడు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సిద్దవటం నుంచి హైవే రోడ్డు మీదుగా జనసేనపార్టీ కార్యకర్తలు, నాయకులు, పవన్‌కళ్యాణ్ అభిమానులతో మోటారు సైకిల్‌పై ర్యాలీ నిర్వహిస్తూ రాజంపేట మండలంలోని భువనగిరిగుట్టకు చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భువనగిరిగుట్టపై చెట్లు నాటారు. ఈ సందర్భంగా భారీ బాణాసంచా పేల్చారు. పెద్దఎత్తున గజమాలలతో అతికారి కృష్ణను స్వాగతించారు. అనంతరం పాతబస్టాండు కూడలిలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు గుల్జార్‌బాషా, టీడీపీ నేతలు లక్ష్మీనారాయణ, సంజీవరావు, వెంకటేశ్వర్లునాయుడు, మాజీ సర్పంచ్‌లు అరుణాచలం, ఎంఎల్ నారాయణ, భువనగిరిపల్లె ఆలయ ధర్మకర్త టైల్స్ నరసింహ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ విజయసాగర్, అబ్బిగారి గోపాల్, భువనగిరిపల్లె చుట్టుపక్కల గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రాజంపేట పార్లమెంట్ జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి ప్రారంభించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, డాక్టర్ బాలరాజు, బీవీఎన్ రాజు, బీసీ నాయకులు మల్లెల సుబ్బరాయుడు, మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, వీరమహిళ రెడ్డిరాణి, సీఐలు ఎల్లమరాజు, రామాంజనేయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటటౌన్: రాజంపేట నియోజకవర్గ సీనియర్ నాయకుడు చెంగారి శివప్రసాద్ ఆధ్వర్యంలో క్లీన్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. రాజంపేటలోని బోయపాలెం వీధి రహదారిలోని చెత్తను చీపుర్లతో తొలగించి పరిశుభ్రంగా ఉంచారు. బైపాస్‌లో జనసేన పార్టీ సిద్ధాంతం పర్యావరణం పరిరక్షణ కొరకు మొక్కలు నాటడం జరిగిందని శివప్రసాద్ తెలియజేశారు. కార్యక్రమంలో కేవీ రమణ, పలుకూరి రవి, శంకర్, నయని నవీన్, కార్మికులు రాఘవేంద్ర, లోకేష్, రమేష్, వికాష్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: జనసేన అధినేత పుట్టినరోజు సందర్భంగా ఆ పార్టీ నేతలు సోమవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాయచోటి సమన్వయకర్త మయాన మహమ్మద్‌అలీ మాట్లాడుతూ నేటి కాలంలో రక్తదానం మహాదానంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రైల్వేకోడూరులోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాలులో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఆధ్వర్యంలో అట్టహాసంగా ఉప ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికులకు బట్టలు, పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. యువకులు మెగా రక్తదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.

సుండుపల్లె: యువతకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదర్శమని జనసేన నాయకులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కూడలి వద్ద జనసేన నియోజకవర్గ నేత అతికారి కృష్ణ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

వీరబల్లి: మండల టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. స్థానిక కస్తూర్బా స్కూల్‌లో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను కట్ చేసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు.

పెనగలూరు: మండల కేంద్రంలోని మూడురోడ్ల కూడలి వద్ద పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని సోమవారం సాయంత్రం జనసేన, టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కూటమి నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు.

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలో సోమవారం రాజంపేట జనసేనపార్టీ నాయకులు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవం కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

నందలూరు: పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను కూటమి నాయకులు సోమవారం సాయంత్రం ఆర్ అండ్‌బీ అతిథిగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. మొక్కలు నాటారు. జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకుడు శ్రీనివాసరాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: జనసేన అధినేత పుట్టినరోజు పురస్కరించుకుని సోమవారం మండలంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ మేరకు మండల జనసేన నాయకులు మాదాసు నరసింహ ఆధ్వర్యంలో మండల జనసైనికులతో కలిసి ఉదయం స్థానిక శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఎమ్మెల్యే శ్రీధర్ స్థానిక పార్టీ కార్యాలయంలో జనసైనికులతో కలిసి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని భారీ కేక్ కట్‌చేశారు.

ఓబులవారిపల్లె: మండలంలోని మంగంపేట జనసేనపార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన సందర్భంగా భారీ కేకును కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. మండల వ్యాప్తంగా పవన్‌కళ్యాణ్ అభిమానులు పలు గ్రామాల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే మొక్కలు నాటడం, సహాయ సహకారాలు అందించడం, రైల్వేకోడూరులో రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

పుల్లంపేట: స్థానిక జనసేన కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, మండల జనసేన ఇన్‌చార్జి ప్రసాద్, పుల్లంపేట అధ్యక్షుడు సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: స్థానిక కోదండరామాలయం వెనుక భాగంలో ఉపముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా కేకు కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం నరసన్నగారిపల్లె గ్రామంలో గ్రామస్థులతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు.

రామాపురం: మండలంలోని బండపల్లి పంచాయతీ సమీపంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సోమవారం పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కాపు బలిజ సంక్షేమసేన జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు ఆధ్వర్యంలో అన్నదానం, పండ్లు పంపిణీ, కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు.


రోడ్లను శుభ్రం చేస్తున్న జనసేన నాయకులు

పేదవర్గాలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

- సీపీఐ నాయకులు డిమాండ్


తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 2: పేదవర్గాల ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ముందుగా మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీగా వస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసర సరకుల ధరలు కొండెక్కాయని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ఎదుట కార్యదర్శి చిన్నయ్య ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు ఉప్పు, పప్పు, నూనె, గ్యాస్ వంటి రేట్లు డబల్ రేట్లు అయ్యాయని, పేదవాడు కొనేది ఎలా? తినేది ఎలా అని మండిపడ్డారు. రేషన్‌షాపుల్లో నాసిరకం బియ్యం మాత్రమే అందజేసి ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ పీర్‌మున్నికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూరి నాగమ్మ, చిన్నయ్య, సుధాకర్, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, శివయ్య తదితర కార్మిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలు ఎంపీకి ఘన సత్కారం


కర్నూలు ఎంపీని సత్కరిస్తున్న టీడీపీ నేత సుధాకర్ తదితరులు

రాజంపేట, సెప్టెంబరు 2: కర్నూలు ఎంపీ నాగరాజును రాజంపేట టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. ఆయన కర్నూలు నుంచి కుటుంబ సభ్యులతో తిరుమల దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ రాజంపేటలోని ఆయన చిన్ననాటి ఆత్మీయులు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్ స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్‌తో పాటు ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ చెన్నూరు సరస్వతి, కుమారుడు డాక్టర్ చెన్నూరు సునీల్ వారి కుటుంబ సభ్యులు టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కార్యదర్శి టి.సంజీవరావు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, భువనగిరి ఆలయ ధర్మకర్త టైల్స్ నరసింహ, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి సుబ్రమణ్యం తదితరులు కలిసి శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

మౌలిక వసతుల కల్పనకై విజ్ఞప్తి

గాలివీడు, సెప్టెంబరు 2: పెద్దూరు బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం మంత్రి కార్యాలయంలో కలిసిన కమిటీ సభ్యులు ఆలయంలో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు ఏర్పాటు, వివాహం చేసుకునే వధూవరులకు గదుల నిర్మాణం, అర్చకులు, స్వీపర్‌కు వేతనాలు, ధూపదీప నైవేద్యాలకు అవసరమైన ఖర్చులను ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకునేందుకు చొరవ చూపాలన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా దేవాదాయశాఖ మంత్రితో కలిసి ఆలయాన్ని సందర్శించి ఆలయంలో వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డిరిషికేశ్, హరికృష్ణ, వీరారెడ్డి, ఆర్య శంకర్, రమేశ్, మల్లికార్జున, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వీరభద్రస్వామి పల్లకీ ఉత్సవం


పల్లకీ ఉత్సవంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 2: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్ఛారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి ఆలయ మాడవీధుల్లో బ్యాండు మేళాలు, కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. భక్తులు వీరభద్రుడిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో సోమేశ్వరస్వామి

చిట్వేలి, సెప్టెంబరు 2: చిట్వేలి శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయం, శివాలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయ అర్చకులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం, మహానైవేద్యం, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేంద్రశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పాతచిట్వేలి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. మండల పరిధిలోని స్తంభారాయుడు ఆలయ సమీపాన నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలను భక్తిభావంతో నిర్వహించుకోవాలి


గ్రామస్తులతో సమావేశమై చర్చిస్తున్న సీఐ

ఒంటిమిట్ట, సెప్టెంబరు 2: వినాయకచవితిని భక్తిభావంతో నిర్వహించుకోవాలని సీఐ కృష్ణంరాజునాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలోని ప్రజలు, గ్రామ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో పోలీసు నిబంధనలు పాటించి వినాయకచవితిని జరుపుకోవాలని, వినాయక విగ్రహాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా గ్రామాల్లో వ్యవహరించ వద్దని, స్నేహపూర్వకంగా వినాయకచవితి నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భూములను వ్యవసాయ కూలీలకు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శేఖర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 2: బడాబాబుల చేతుల్లో ఉన్న భూములను దళిత వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయం లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోల మణి అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆర్.వెంకట్రావ్, జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, సీపీఐ కోడూరు మండల కార్యదర్శి రాజశేఖర్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, అజీమాటీ, రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు రవి, మదనపల్లి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మునికాటయ్య, జి. చంద్రశేఖర్, తంబళ్లపల్లి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మేమ నారాయణ, నారాయణస్వామి, నాయకులు శంకరప్ప, తిప్పన ప్రసాద్, నాగమ్మ, గంగాదేవి, రాణి, రమణయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు తుంగలో : ఏఐఎస్‌ఎఫ్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 2: ప్రభుత్వ నిబంధనలను ప్రైవేటు విద్యా సంస్థలు తుంగలో తొక్కుతున్నాయని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు పట్టణంలో నిబంధనలు పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వం శెలవు ప్రకటించినా 10వ తరగతి విద్యార్థులు ప్రైవేటు యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తున్నారని తెలుసుకుని ప్రైవేటు పాఠశాల వద్దకు వెళ్లి విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం వద్దకు వెళ్లి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. దీంతో విద్యా శాఖ అధికారికి సమాచారం పంపించారని తెలిపారు. ప్రైవేటు స్కూళ్ల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రైవేటు విద్యా సంస్థలు చెలగాటం ఆడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ననదీప్, నితీష్‌కుమార్, నాయకులు నాగేంద్ర, ప్రైమ్‌సాయి, పవన్‌కుమార్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.20 వేలు సాయం




పుల్లంపేట, సెప్టెంబరు 2: మండల పరిధిలోని రెడ్డిపల్లె పంచాయతి అరుంధతివాడలో సోమవారం రెడ్డిపాక రామయ్య గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ నాయకులు, రెడ్డిపల్లె చెరువు నీటిసంఘం మాజీ అధ్యక్షుడు రొంపిచెర్ల మురళి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు.

కొయ్యబొమ్మల కాణాచి మాధవమాల

90 ఏళ్లుగా జీవనాధారం చేసుకున్న కళాకారులు

జీఐ గుర్తింపునకు నేడు గ్రామానికి రానున్న అధ్యయన బృందం





బొమ్మలు చెక్కుతున్న కళాకారులు

పల్లెల్లో కోడికూతతో నిద్ర లేవడం సర్వసాధారణం. తిరుపతి- శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డుకు సమీపంలోని మాధవమాలలో మాత్రం ఉలి చప్పుళ్లతో గ్రామస్తులు నిద్ర లేస్తారు. ఈ గ్రామంలో ఇంటింటా కళాకారులు దర్శనమిస్తారు. కొయ్యబొమ్మలపై ఈ గ్రామస్తులు చెక్కే అద్భుత కళాఖండాలు ఎవరినైనా ఆకట్టుకుంటాయి. గ్రామాన్ని కొంతకాలం కింద బెల్జియం దేశస్తులు సందర్శించడంతో మాధవమాల అంతర్జాతీయంగా ఖ్యాతి గడించింది.

- ఏర్పేడు

ఏర్పేడు మండలం మాధవమాలలో 90 ఏళ్లుగా కొయ్యబొమ్మలను తయారు చేయడమే వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు ఇక్కడి కళాకారులు. గతంలో కృష్ణయ్య ఆచారి, చిన్నయ్యఆచారి, దొరస్వామి ఆచారి, మునెయ్య ఆచారి తదితరులు గ్రామంలోని రైతులకు కొయ్యనాగళ్లు, గడ్డమానులు, పారలు, తొలికలకు కత్తులు తయారు చేసి ఇచ్చేవారు. అలాగే గ్రామపరిసరాల్లో దొరికే కొయ్యతో చిన్నచిన్న బొమ్మలు తయారు చేసేవారు. వీరి బాటలోనే వారి వారసులు ఇదే వృత్తిని ఎంచుకున్నారు. దానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఆలయాలపై ఉన్న దేవతా మూర్తులు, ధ్వజస్తంభాలు, వినాయకుడు, శ్రీవేంకటేశ్వరస్వామి, అష్టలక్ష్మి, ధనలక్ష్మి, బుద్ధుడు, ఆంజనేయులు, మహావిష్ణువు, శ్రీకృష్ణుడు, పూర్ణకుంభం వంటి కొయ్యబొమ్మలకు మరింత వన్నె తెస్తున్నారు.

2013లో సంక్షేమ సంఘం

మాధవమాలలో బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీ పేరిట 2013లో కళాకారులు ఓ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా లోకనాథం ఆచారి, కార్యదర్శిగా రాజాచారి, చీఫ్ ప్రమోటర్‌గా కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. ఈ గ్రామంతో పాటు గోపాలపురం, పాతవీరాపురం, గుండ్రాళ్లమిట్ట, ఇసుకతాగేలి, అంజిమేడు, కృష్ణంపల్లి గ్రామాలు రేణిగుంట, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, బుచ్చినాయుడుకండ్రిగ మండలాలకు చెందిన 360మందికిపైగా కళాకారులకు కూడా ఈ సంస్థలో సభ్యత్వం ఇచ్చారు. డీఆర్‌డీఏ, నాబార్డు సహకారంతో కళాకారులను గ్రూపులుగా విభజించారు. మాధవమాలలో ఓ పెద్ద భవనాన్ని నిర్మించి అక్కడే కార్మికులకు పని కల్పించారు.

దేశ, విదేశాల్లో ఖ్యాతి : ఆలయాల ధ్వజస్తంభాలు, రథాలు, ప్రధాన ద్వారాలతోపాటు అడుగు నుంచి 15 అడుగుల వరకు దేవతామూర్తుల బొమ్మలను తయారు చేస్తారు. ఈ బొమ్మలను తమ సంస్థ ద్వారా జైపూర్, ముంబై, కోల్‌కతా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో జరిగే ఎగ్జిబిషన్లకు పంపుతారు. అక్కడ నుంచి చైనా, జపాన్, లండన్, అమెరికా వంటి దేశాలకు ఎగుమతి చేస్తారు. దీంతో దేశ, విదేశాల్లో ఈ సంస్థ ఖ్యాతిని గడించడంతో గత ప్రభుత్వంలో 2021 సెప్టెంబరుకు శ్రీబాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీకి అప్పటి ప్రభుత్వం వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించింది.



వినాయకుడి బొమ్మ



వెంకటేశ్వరస్వామి బొమ్మలు

'చెక్క'ని కళాకృతులకు చక్కని గుర్తింపు



మాధవమాలతో పెనవేసుకున్న కళా నైపుణ్యానికి భౌగోళిక గుర్తింపు (జియోలాజికల్ ఐడెంటిటీ) నిచ్చేందుకు మంగళవారం తొలి అడుగులు పడుతున్నాయి. జీఐగా బ్రాండింగ్ పొందడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు నిపుణులు రానున్నారు. రిసెల్యూట్ సంస్థకు చెందిన శుభాజిత్ సాహా, శ్రీవత్స మంగరాటిలు నిశిత అధ్యయనానికి వస్తున్నారు. జీఐ గుర్తింపు దరఖాస్తుకు వీరు సేకరించి.. సమర్పించే సమాచారం కీలక భూమిక కానుండటం విశేషం. దీంతో వీరి పరిశీలనకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది.

సారూ.. సమస్యలు పరిష్కరిస్తారా!



అర్జీపై సంబంధిత అధికారికి ఫోన్‌లో ఆదేశం ఇస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబరు 2: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. బాధితుల సమస్యలను విని పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొత్తం 209 మంది వివిధ సమస్యలపై అర్జీలిచ్చారు. వీటిలో రెవెన్యూశాఖకు 189, మున్సిపాలిటీలకు 3, వ్యవసాయశాఖకు 2, డీఆర్‌డీఏ, వీకోట, పలమనేరు ఎంపీడీవో 2, ఆర్టీసీ, పశు సంవర్ధకశాఖ, తదితర శాఖలకు 13 అర్జీలు ఉన్నాయి. అధికారులకు అందిన సమస్యల్లో కొన్ని..

- తవణంపల్లె మండలం విజయనగరం యానాది కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని పలువురు గిరిజనులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 10 గృహాలకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయన్నారు. కాలనీలో తాగునీటి ట్యాంకు లేకపోవడంతో నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. కూలి పనుల కోసం వెళ్లేవారు కరెంటు వచ్చినప్పుడు నీళ్లను తెచ్చుకోవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. కాలనీలో చాలా మందికి ఆధార్‌కార్డులు లేకపోవడంతో పాఠశాలలకు వెళ్లడం లేదన్నారు. అలాగే వీధి దీపాలు, అంగన్‌వాడీ కేంద్ర భవనం లేదన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.
- వ్యవసాయ భూములకు వెళ్లేదారిని భూస్వాములు ఆక్రమించారని చిత్తూరు మండలం ఎల్‌బీపురం ప్రాంతానికి చెందిన రైతులు వాపోయారు. సర్వే నెంబరు 216, 217లో ఉన్న దారిని ఆక్రమించి రాతి కూసాలు నాటి మూసివేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి దారి సమస్యను పరిష్కరించాలని కోరారు.
- శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని తవణంపల్లె మండలం కృష్ణాపురంఎస్టీ కాలనీవాసులు కోరారు. శ్మశానభూములు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలని, అలాగే బోరును డ్రిల్లింగ్ వేయాలన్నారు.

పోలీసు శాఖకు 51 ఫిర్యాదులు

ప్రజా ఫిర్యాదులపై అలసత్వం చూపకూడదని, ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠ అన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 51 మంది అర్జీదారులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటా ఎస్పీ బాధితులకు హామి ఇచ్చారు. సోమవారం నాటి కార్యక్రమంలో భూ తగాదాలు 14, ఆస్తి తగాదాలు 11, కుటుంబ తగాదాలు 10, డబ్బు తగాదాలు 5, వేధింపులు 5, చీటింగ్ 3, దారి సమస్యలు 2, మిస్సింగ్ కేసు 1 చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సాయినాథ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

డీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 2: బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందంటూ డీఈవో దేవరాజుపై కలెక్టర్ సుమిత్ కుమార్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో మూడు రోజుల్లో బిల్లు క్లియర్ చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా పిర్యాధుల పరిష్కార వేదికలో డీఈవోను కలెక్టరు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే... ఈ ఏడాది ఫిబ్రవరిలో యాదమరి మండల పరిధిలోని పీఈఎస్ పబ్లిక్ స్కూల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. విద్యార్థులు, వారి గైడ్స్ సాయంతో 400 ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో వచ్చిన వారికి భోజన ఏర్పాట్ల కోసం చిత్తూరులోని గజేంద్ర క్యాటరింగ్ వారికి రూ.3.68 లక్షలకు అప్పగిస్తూ, రూ.లక్ష అడ్వాన్స్‌గా ఇచ్చారు. మిగిలిన మొత్తం రూ.2.68 లక్షలు చెల్లించాలని కోరుతూ క్యాటరింగ్ నిర్వహకుడు గత ఏడు నెలల కాలంగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరిగినా, ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు కలెక్టర్‌ను ఆశ్రయించాడు. బిల్లు చెల్లించాలని కలెక్టర్ పలుమార్లు సూచించినా ఫలితం కనిపించలేదు. దీంతో బాధితుడు సోమవారం మరోసారి కలెక్టర్‌ను ఆశ్రయించి తన బాధను వివరించారు. అప్పులు తెచ్చి భోజనం పెట్టానని, నెలల గడవడంతో ఆర్థిక ఇబ్బందిని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దీతో మూడురోజుల్లో బిల్లు మొత్తం క్లియర్ చేయాలని డీఈవో దేవరాజుకు కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 2: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆర్థికపరమైన అంశాలపై అవగాహన, ఆన్‌లైన్ క్విజ్ మూడు దశల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎల్‌డీఎం హరీష్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. జాతీయ, జోనల్, రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలకు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.10 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8 లక్షలు, తృతీయ బహుమతి రూ.6 లక్షలు ఇస్తారని వెల్లడించారు. 1999 సెప్టెంబరు ఒకటి నాటికి జన్మించి 25 సంవత్సరాలోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9490690274ను సంప్రదించాలని తెలిపారు.

మున్సిపల్ ఛైర్మన్ యూటర్న్

- నాడు వైసీపీకి రాజీనామా చేసి.. నేడు మళ్లీ ఆ పార్టీలోనే ఉంటామన్న అలాంబాషా
- తిరుపతిలో ఎంపీ మిథున్‌ను కలిసిన పుంగనూరు నేతలు



తిరుపతిలో ఎంపీ మిథున్‌తో మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్ అమ్ము



రొంపిచెర్లలో చల్లాబాబు ఇంటి వద్ద రాజీనామా చేసిన పుంగనూరు వైసీపీ కౌన్సిలర్లు (ఫైల్)

పుంగనూరు, సెప్టెంబరు 2: 'మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పదవులిచ్చి పవర్ లాగేసుకున్నారు' అని ఆరోపిస్తూ జూన్ 27వ తేది వైసీపీకి రాజీనామా చేసి త్వరలో టీడీపీలో చేరతామన్న పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ ఎస్.అలీంబాషా యూటర్న్ తీసుకున్నారు. రెండు నెలల తర్వాత.. వైసీపీలోనే ఉంటామని చెప్పారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్వగృహంలో వైసీపీ నేతలతో కలిసి ఛైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్ అమ్ము (రహంతుల్లా) ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. రొంపిచెర్లలోని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి వైసీపీకి చెందిన ఛైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్లు రహంతుల్లా, ఎం.రామకృష్ణమరాజు, జె.నరసింహులు, యువకుమారి, మమత, వి.కళిదాసు మొదలియార్, ఖాన్‌నూర్జహాన్, కసురున్నీషా, మనోహర్, రేష్మ రెండు నెలల కిందట వెళ్లారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పుంగనూరు అభివృద్ధి, మంత్రి నారా లోకేశ్ యువతకు మంచి ప్రాధాన్యం ఇవ్వడం, చంద్రబాబు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై తాము చల్లా బాబు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబును కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు నాడు వెల్లడించారు. ఇంతకాలం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వారి కుటుంబం తమకు పదవులు ఇచ్చినా అభివృద్ధి చేయడానికి అధికారం ఇవ్వకుండా రబ్బరు స్టాంపులుగా వాడుకున్నారని అలీంబాషా, అమ్ము ఆరోపించారు. తాజాగా సోమవారం వీరిద్దరూ తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. రెండు నెలలక్రితం వివిధ కారణాలతో వైసీపీకి రాజీనామా చేసినా తాము ఏపార్టీలో చేరలేదన్నారు. ఇకపై జీవితాంతం వైసీపీలో పెద్దిరెడ్డి కుటుంబం వెంటే ఉంటామన్నారు. వీరితో పాటు కౌన్సిలర్ రేష్మ పాల్గొన్నారు.

హైవోల్టేజ్‌తో గృహోపకరణాల దగ్ధం

ధర్నాకు దిగిన చెంగనపల్లె వాసులు



చెంగనపల్లెలో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

ఐరాల, సెప్టెంబరు 2: హైవోల్టేజ్ కారణంగా మండలంలోని చెంగనపల్లెలో సోమవారం పలు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గ్రామస్తులు ధర్నాకు దిగారు. వారి వివరాల మేరకు.. గ్రామంలో ఆరునెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మార్చారు. ఆదివారం ఉదయం హై ఓల్టేజ్ కారణంగా పేలిపోయింది. సర్పంచ్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేసి సింగిల్ ఫేస్ కరెంటు విడుదల చేశారు. హైవోల్టేజ్ రావడంతో 70ఇళ్లలో 20 టీవీలు, 15 ఫ్రిడ్జ్‌లు, 5ల్యాప్‌టాప్‌లు, వాషింగ్ మిషన్లు, ఏసీలు కాలిపోయాయి. రూ.10లక్షల మేర నష్టం వాటిల్లింది. ఆగ్రహానికి గురైన మహిళలు రోడ్డుపై ధర్నాకు దిగారు. ఏఈ వచ్చి సమాధానం చెప్పాలని భీష్మించుకుని కూర్చున్నారు. ఐరాల ఎస్‌ఐ నరసింహులు చేరుకుని ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో శాంతించారు.

క్వారీ పనులు ఆపేయాలి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 2: మండలంలోని గడ్డూరుగ్రామ సమీపంలో నిర్వహిస్తున్న క్వారీలో పేలుళ్ల కారణంగా తమకు ఇబ్బందికరంగా ఉందని అందువల్ల క్వారీలో పనులు ఆపేయాలని గడ్డూరు గ్రామస్తులు కోరారు. సోమవారం గ్రామస్తులు క్వారీవద్దకు వెళ్లి పనులు వెంటనే ఆపేయాలని క్వారీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు స్పందించి గ్రామసమీపంలో క్వారీ ఉండడం వల్ల కలుగుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



క్వారీ వద్ద గుమికూడిన గడ్డూరు గ్రామస్తులు

దళిత కుటుంబానికి న్యాయం చేయాలి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 2: దళితుల చెందిన భూమి ఆక్రమణను అడ్డుకుని న్యాయం చేయాలని జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు మునిరత్నం, పార్థసారథి కోరారు. బైరెడ్డిపల్లె మండలంలోని కమ్మనపల్లె గ్రామం వద్ద దళితుడైన తిరువలప్పకు చెందిన భూమిని కొందరు అగ్రకులస్తులు ఆక్రమించుకుంటున్నా రెవిన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బైరెడ్డిపల్లె రెవిన్యూ కార్యాలయం ఎదుట బాధితులతో కలసి సంఘ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన భూమిలో తిరువలప్ప వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. కొందరు అగ్ర కులస్తులు ఆ భూమిని ఎలాగైనా కాజేయాలనే చూస్తున్నారని పేర్కొన్నారు. ఆక్రమణను అడ్డుకుని తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ మాధవరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు న్యాయం చేస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు





మదనపల్లెలో అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

బి.కొత్తకోటలో రక్తదానం చేసున్న జనసేన నేత కిరణ్‌రాయల్



పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా పీటీఎంలో అన్నదానం చేస్తున్న జనసైనికులు



ములకలచెరువులో అన్నదానం చేస్తున్న టీడీపీ నేత పాలగిరి సిద్ధా



పీలేరులో రక్తదానం చేస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 2: జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన కేక్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పనిచేసే పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలయికతో ఐదున్నర కోట్ల ఆంధ్రుల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో దారం హరి, నాదెళ్ల విద్యాసాగర్, ఆంజనేయకుమార్, షంషీర్, బాబా ఫక్రుద్దీన్, జనసేన నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద పవన్‌కళ్యాణ్ అభిమానులు జయ భవ్య, కిశోర్ దంపతుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించి 300మంది పేదలకు అన్నదానం చేశారు. సీటీఎం క్రాస్‌రోడ్డులో దిలీఫ్‌కుమార్, టీడీపీ నాయకులు రెడ్డిరాంప్రసాద్, చల్లా నరసింహులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మదనపల్లె జనసేన పార్టీ సీనియర్ నేత శ్రీరామరామాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం వరాల ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు జనసేన నాయకుడు శ్రీరామ హరిహరన్ పాలు, పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. జనసైనికులతో రక్తదాన శిబిరం నిర్వహించి అనంతరం 200మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సీటీఎం, కొత్తవారిపల్లెలో కేక్‌కట్ చేసి, అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ యువనాయకుడు శ్రీరామ హరిహరన్, పట్టణ అధ్యక్షుడు జగదీష్‌బాబు, నాయకులు విజయేంద్ర రాయల్, నవాజ్, సోను, హర్ష, నవీన్, అవినాష్, శేఖర్, సత్య, బహదూర్, పెద్ద ఎత్తున జనసైనికులు, నాయకులు పాల్గొన్నారు.

పీలేరులో: జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం పీలేరులోని జనసైనికులు అట్టహాసంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక మదనపల్లె టర్నింగ్‌లో జనసేన జెండా ఆవిష్కరించడమే కాకుండా అక్కడి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో పేదలకు అన్నదానం చేశారు. అనంతరం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పీలేరు ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్, పీలేరు మండల అధ్యక్షుడు మోహనకృష్ణ, జనసైనికులు గజేంద్రా, మున్నా, రాజేశ్, నవీన్, పవన్, గౌస్, గాయత్రి, గురుమోహన్, నరేశ్, విజయ్, వెంకటరమణ, హరీశ్, ధనంజయ, డాక్టర్ మురళీకృష్ణ, పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను పీటీఎంలో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తంబళ్లపల్లె నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ హాజరయ్యారు. సోమవారం స్థానిక బస్టాండు కూడలిలో మండల జనసేన, టీడీపీ, బీజేపీలకు చెందిన కూటమి నాయకులు పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురష్కరించుకుని కేక్‌ను కట్ చేసి సంబరాలను చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీటీసీ సూరి, టీడీపీ నాయకులు కుమ్మరవారిపల్లె రాజేష్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ (చిన్నా), భజంత్రి రామచంద్ర, పాల గంగాద్రి, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలోని పెద్దమండ్యం, సిద్దవరం, తురకపల్లి తదితర గ్రామాలలో సోమవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టిరోజు వేడులకల సందర్భంగా కేక్‌లు కట్ చేసి పార్టీ కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో పెద్దమండ్యంలోని బేతస్థ అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. బండమీదపల్లి గ్రామ పరిధిలోని తురకపల్లిలో ఇస్మాయిల్ ఆధ్వర్యంలో కూటమినేతలు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కూటమి నేతలు సిద్దవరం ప్రసాద్, బాబురెడ్డి, రుక్మాంగధరెడ్డి, ఆర్‌కే రామకృష్ణ, ప్రభాకరరెడ్డి, భీమయ్య, సయ్యద్‌షావలి, నాగరాజు, ఫయాజ్, బావాజీ, రవీంద్ర, ఇస్మాయిల్(చింటు), వీరమహిళలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాండులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దినేష్, జగదీష్, మురళీ, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ 53వ జన్మదిన వేడుకలను తంబళ్లపల్లెలో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో పట్టణంలో ద్విచక్రవాహ ర్యాలీ నిర్వహించి తంబళ్లపల్లె సిద్దారెడ్డిగారిపల్లెలో నూతనంగా జనసేన జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం హరిత కూడలి వద్ద పవన్ కళ్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, సురేష్, రఘు, టీడీపీ నాయకులు సిద్దమ్మ, గ్రామ ప్రధాన కార్యదర్శి శివకుమార్, వీరాంజినేయులు, దివ్యాంగ అధ్యక్షుడు రామాంజులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, గులాం, జగదీష్, భాస్కర్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను మదనపల్లి జనసేన నేత తోటకళ్యాణ్, మండల అధ్యక్షుడు ప్రదీప్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో పాటు జనసేన కార్యకర్తలు మదనపల్లి నుంచి బైకుర్యాలీగా నిమ్మనపల్లి వచ్చి కేకు కట్‌చేసి అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసే జనసేన కార్యక్తలను అభినందించారు. అనంతరం ముష్టూరులోని కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న 200మంది విద్యార్థినులకు మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తన సొంత నిధులతో బకెట్లు, జగ్గులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను బి.కొత్తకోటలో ఆ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక జనసేన నాయకుడు చింతల కిరణ్‌రాయల్ ఆధ్వర్యంలో జ్యోతిసర్కిల్ లో భారీకేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కొండాసెంటర్ వద్ద మెగారక్తదానశిబిరం ఏర్పాటు చేసి 130కి పైగా జనసైనికులు రక్తదానం చేశారు. జెండాలను చేతపట్టి పట్టణంలో పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరపంచాయతీ పరిధిలో కమిషనర్ మనోహర్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసైనికులు రామాంజనేయులు, ప్రసాద్, మనోహర్ రాయల్, శేఖర్, చందు, గౌతం, రాజేంద్రప్రసాద్, మహేంద్ర,నాగేంద్ర, శ్రీనివాసులు, చైతన్య, ప్రశాంత్, కేశవ, సుధాకర్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కురబలకోటలో: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను టీడీపీ, జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని అంగళ్ళు ఎన్‌టీఆర్ సర్కిల్‌లో కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచి పెట్టారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, అయూబ్‌బాషా, మనోజ్, అంజి, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, సూరి, రాజంపేట తెలుగు యువత కార్యదర్శి అయూబ్ బాషా, భాస్కర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో సోమవారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అన్నదానం కార్యక్రమాలు జరిగాయి. అలాగే జనసేన ఇన్‌చార్జితో కలిసి టీఎన్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధాలు భారీ కేక్‌ను కట్ చేసి అన్నదానం చేశారు. రక్తదాన శిబిరంలో 106 మంది రక్తదానం చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి. నేతలు కేవీ రమణ, శివన్న, జనసేన నాయకులు షోరూం సూరి, జేసీబీ శీన, రాజు, సుబ్రమణ్యం, అనీల్ పాల్గొన్నారు.

కలికిరిలో: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన శ్రేణులు, పవన్ అభిమానులు కలికిరిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఆసుపత్రిలోనే పవన్ అభిమానులు రక్త దానం చేశారు. కార్యక్రమాలను నియోజకవర్గ ఇన్‌చార్జీ బెజవాడ దినేష్, మండల ఇన్‌చార్జీ అస్లామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వాల్మీకిపురంలో: రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం వాల్మీకిపురంలో ఘనంగా జరుపుకున్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు పంచిపెట్టారు. అలాగే జనసేన జెండా ఆవిష్కరించి పేదలకు పండ్లు, పాలు, రొట్టెల పంపిణీ చేశారు. ఈకార్యక్రమాలలో పీలేరు జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, జనసైనికులు, పవన్‌కళ్యాణ్ అభిమానులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జనసేన నాయకులు, పవన్ అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చెంబకూరు పంచాయతీలో జనసేన రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంచిపెట్టి అనంతరం మొక్కలు నాటారు. మండల కేంద్రంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల, రూరల్ ప్రెసిడెంట్ గ్రానైట్ బాబు, జిల్లా జాయింట్ సెక్రటరీలు సనావుల్లా, సికిందర్, పూల ఆంజప్ప, ప్రభాకర్, జనార్దన, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

భువనేశ్వరి నగర్‌లో చోరీ

80 గ్రాముల బంగారు, 500 గ్రాముల వెండి అపహరణ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2: మదనపల్లె మండలం పోన్నూటిపాలెం పంచాయతీ, భువనేశ్వరి నగర్ ఫస్ట్‌క్రాస్‌లో ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి నగలు దోచుకెళ్లినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. భువనేశ్వరీ నగర్‌లోని రంగులక్ష్మీదేవి, రామచంద్ర, తన రెండో కుమారైతో కలిసి తిరుపతిలోని తన తమ్ముడి ఇంటికి శనివారం వెళ్లి తిరిగి మదనపల్లెకు ఆదివారం రాత్రి చేరుకున్నారు. కాగా వారు వచ్చే సరికి ఇంటి మెయిన్ గేట్ దెబ్బతిని ఉండడంతో ఇంట్లోకెళ్లి బీరువాలో చూడగా అందులో ఉన్న 80 గ్రాములు బంగారు, 500గ్రాములు వెండి నగలు దొంగలు దోచుకెళ్లినట్లుగుర్తించారు. దీంతో వారు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కేసు నమోదు చేశారు.

రెండు ట్రాక్టర్లకు జరిమానా

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 2 : మండలంలోని కందుకూరులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు పీటీఎం ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి దాడిచేసి రెండు ట్రాక్టర్లను పట్టుకుని పీటీఎం తహసీల్దార్ కార్యాలయానికి తరలించగా శ్రీరాములు నాయక్‌కు ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 10 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఎవ్వరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తిపై రాళ్ల దాడి

వాల్మీకిపురం, సెప్టెంబరు 2: మహిళపై దాడిని అడ్డుకున్న ఓ వ్యక్తిపై ఇద్దరు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన వాల్మీకిపురంలోని ఇరాని కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ఓ మహిళపై అదే కాలనికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో బాధితురాలు తమ్ముడు నరేంద్ర దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడిని 108 ద్వారా చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బోరు మోటర్ స్టార్టర్ చోరీ

పెద్దమండ్యం, సెప్టెంబరు 2: పెద్దమండ్యం మండలం సిద్దవరం గ్రామ పంచాయతీ గాజులపల్లి వ్యవసాయ బోరు మోటర్ స్టార్టర్ చోరీకి గురైనట్లు బాధితురాలు టీడీపీ మహిళా రైతు శాంతమ్మ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయబోరు వద్ద పొలం పనులు ముగించుకొని ఆదివారం సాయంత్రం ఇంటికి వెళ్లిపోయి సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి టమోటా పంటకు నీరుకడతామని మోటరు వేయడానికి చూడగా స్టార్టర్ చోరీకి గురైందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామసముద్రం, సెప్టెంబరు 2: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉమాశంకర్ అనే వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కాలనీకి చెదిన ఉమాశంకర్ తాగుడుకు బానిసై అప్పులు చేశాడు. ఈ విషయమై భార్య అతనిని మందలించగా గత నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విజయవాడ వరద బాధితులకు అత్యవసర మందులు సరఫరా



వరద బాధితులకు అత్యవసర మందుల కిట్లను సరఫరా చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి, మందుల దుకాణం యజమానులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 2: విజయవాడలో వరదలతో నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వ ఆదేశాలలో మదనపల్లె కెమిస్ట్, డ్రగ్గిస్టల ఆధ్వర్యంలో అత్యవసర మందుల కిట్లను సరఫరా చేశారు. సోమవారం డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని హోల్‌సేల్ మందుల దుకాణాల నుంచి అత్యవసర మందుల కిట్లను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో హోల్‌సేల్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ దుకాణాలు వరద నీటిలో తడచిపోయాయని, దీంతో ప్రభుత్వ ఆదేశాలలో వైద్య ఆరోగ్య అధికారుల సూచనలతో మదనపల్లె నుంచి 2వేలు అత్యవసర మందుల(జ్వరం, జలుబు, వాంతులు, విరేచనాలకు వినియోగించే మందులు) కిట్లను సేకరించి, విజయవాడకు పంపుతున్నామన్నారు. దీనికి సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ బిల్లులను మంజూరు చేయిస్తాం

గుర్రంకొండ, సెప్టెంబరు 2:అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పెండింగ్ బిల్లులను మంజూరు చేయిస్తామని ఎంపీడీవో వెంకటేశులు పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లె జగనన్న కాలనీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్‌లో ఉన్న బిల్లులు లబ్ధిదారులకు అందేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రసాద్‌నాయుడు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

జామియా మసీదు భూములకు పాసుపుస్తకాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

కురబలకోట, సెప్టెంబరు 2: కురబలకోట జామియా మసీదు భూములకు సంబంధించి పాసుపుస్తకాలు మంజూరు చేయాలని మసీదు కమిటీ సభ్యులు తహసీల్దార్ తపశ్వినికి వినతిపత్రం అందజేశారు. సోమవారం మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు భూములకు సంబంధించి వివరాలను తెలియజేశారు. కాగా సర్వే నంబరు 1734-1లో 6.65 ఎకరాలు, 1750-2లో 1ఎకరం భూమి ఉన్నదని దానికి జామియా మసీదు పేరిట పాసుపుస్తకాలు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాబాఫక్రుద్దీన్, రెహమాన్, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు2: మదనపల్లె పట్టణం, మండలాల్లో వినాయక చవితి పండుగకు విగ్రహాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తాలుకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం విగ్రహాల తయారు దారులతో తాలుకా సీఐ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాలు ఏర్పాటు చేసుకుని వినాయక విగ్రహాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నవారికి మాత్రమే పీఆర్ కోడ్ వస్తుందని అప్పుడే వినియోగదారులకే విగ్రహాలు విక్రయించాలని తెలిపారు. సమావేశంలో శ్రీనివాసులు, రామమూర్తి, వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం

వాల్మీకిపురం, సెప్టెంబరు 2: వాల్మీకిపురం పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహాలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా జగన్మాత గోముకాదేవి సమేత హరిహర బ్రహ్మలింగోద్భవ మహా శివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో క్షీర, సప్తదాసు, ఏకవార మహారుద్రాభిషేకం, జలాభిషేకం, క్షీరాభిషేక, విభూది అభిషేకాల అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థ అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈకార్యక్రమాలలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య పూజలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 2 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో సోమవారం శ్రావణ అమావాస్యను పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

రామసముద్రం, సెప్టెంబరు 2: బీజేపీ సభ్యత్వ నమోదును రామసముద్రం మండలంలో వేగవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బజార్‌వీధిలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ మండల కమిటీ, శక్తి కేంద్ర ప్రముఖులు హాజరై 37 బూత్‌లలో ప్రతి బూత్‌లో సుమారుగా 200సభ్యత్వాలు చేపట్టాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ శేఖర్, జిల్లా యువ మోర్చా వీరకుమార్, దళిత మోర్చా కృష్ణ, వెంకటేష్, రామకృష్ణ, మండల అధ్యక్షుడు ఇంజం ఆనంద, తదితరులు పాల్గొన్నారు.

చంటి పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

కలకడ, సెప్టెంబరు 2:వర్షాకాలంలో చంటి పిల్లలు అనారోగ్యం భారీన పడకుండా వారి ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధచూపాలని వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని దేవళపల్లెలో సిబ్బందితో కలిసి 104 ద్వారా గ్రామస్తులకు వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా 45 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం ప్రజలకు దోమల నివారణ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

పదిమంది పేకాటరాయుళ్ల అరెస్టు

కలికిరి, సెప్టెంబర్లు 2: పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ కె. రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. కలికిరి పట్టణం శివార్లలో మూరేవాండ్లపల్లె రోడ్డు సమీపంలోని ఒక చెట్టు కింద సోమవారం పేకాడుతుండగా దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8250లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మూడు మండలాల అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 2: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే నివాసం వద్ద మూడు మండలాలు, పట్టణంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారంలో రెండు రోజులు అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజాసమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. వీధిదీపాలు, మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో జనరల్ ఫండ్‌కు తోడు 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుచేస్తూ తాగునీటి పథకాలను నిర్వహించాలన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల మంజూరుకు కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఇలా రైతులు ఫిర్యాదులు చేస్తే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీవోలు భానుప్రసాద్, రమేశ్, తహసీల్దార్‌లు నిర్మలాదేవి, దనంజేయులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి మాజీ సీఎం పరామర్శ



టీడీపీ నేత మురళి కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ సీఎం కిరణ్

వాల్మీకిపురం, సెప్టెంబర్ 2: వాల్మీకిపురం పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మురళి కుటుంబాన్ని మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సోమవారం పరామర్శించారు. మురళి తండ్రి జనార్దన గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సీఎం కిరణ్ వాల్మీకిపురం విచ్చేసి మురళి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడొద్దని ఏదైనా కష్టమొస్తే తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలవగా అందరినీ ఆయన పలకరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, గాంధీపేట రమణ, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, కోసూరి రమేష్, రాజగోపాల్, కేకే నాయుడు, బొక్కసం బ్రదర్స్, చాను, మస్కట్ మస్తాన్, జంషీద్, సాదిక్, సైదు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ మండలంలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తన అనుచరుల కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని సంగసముద్రం గ్రామానికి చెందిన కార్యకర్త ఇంటికి వెళ్లారు. అనంతరం ఇటీవల ఎల్లుట్ల పంచాయతీ నగిరికి చెందిన నాగభూషణనాయుడు మృతి చెందాడు. వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్‌నాయుడు ఇంటికి వెళ్లి తేనేటి విందును స్వీకరించారు. అక్కడ నుంచి నడిమిఖండ్రిగకు చెందిన నల్లారి అనుచరుడు సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ అవకతవకలపై ఫిర్యాదులు చేయవచ్చు



హౌసింగ్‌లో సమ'్యలపై టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 2: గతంలో గృహ నిర్మాణ శాఖలలో జరిగిన అవినీతి అక్రమాల, అవకతవకలపై జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన 08561-293086 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాల్ సెంటర్ ఉదయం 9:00 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తుందని జిల్లాలోని ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఆయా మండలాలకు వెళ్లి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ శివయ్యను ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ వెంకటసుబ్బయ్య, డీఆర్‌ఓ సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బియ్యంతోపాటు చక్కెర పంపిణీ

కలికిరి, సెప్టెంబరు 2: రేషన్ షాపుల్లో బియ్యంతోపాటు ఈ నెలలో చక్కెర కూడా పంపిణీ చేస్తున్నారు. ఒక్కో అంత్యోదయ కార్డుకు రూ. 13.50లతో కిలో పంచదార అందజేస్తున్నారు. ఇక సాధారణ కార్డులకు మాత్రం అర కిలో ధర రూ.17గా నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 40,512 అంత్యోదయ కార్డులు, సాధారణ కార్డులు 5,02,853 ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా రెండు వేల పైబడి అంత్యోదయ కార్డులు మదనపల్లెలో 3441, కోడూరులో 2522, రాయచోటిలో 2264, సుండుపల్లెలో 2583, బి.కొత్తకోటలో 2166, పి.టి.ఎంలో 2099 వంతున ఉన్నాయి. వీటన్నింటికీ అవసరమైన చక్కెర నిల్వలను పంపిణీకి సిద్ధం చేశారు. సాధారణ రీతిలో ఎండీయూ వాహనాల ద్వారా ఈ నెల కూడా బియ్యంతోపాటు చక్కెర పంపిణీ చేస్తున్నారు. ధరలో వ్యత్యాసమున్నా, నాణ్యతలో అనుమానమున్నా వెంటనే 1967 టోల్ ఫ్రీ నంబరుకు ఫోను చేసి అధికారుల దృష్టికి తీసుకురావాలని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు.

రేపు మదనపల్లె రైతు బజార్‌లో అవగాహన సదస్సు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2: మదనపల్లి పట్టణంలో గల రాజీవ్ రైతు బజార్‌లో ఈ నెల 4న (బుధవారం) ఉదయం 11 గంటలకు రైతులు, ఫార్మర్స్ ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు) వ్యాపారస్థులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి టి త్యాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లి పట్టణంలో రాజీవ్ రైతు బజారును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి పునఃప్రారంభం చేయుటకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆగస్టు 27న జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు రైతులు, ఫార్మర్స్ ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు), వ్యాపారస్థులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, మదనపల్లి మున్సిపల్ కమిషనర్, రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ తదితరులు పాల్గొని రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తారన్నారు.

పెయింటర్స్ కాలనీ నగరపంచాయతీ లోనే ఉండాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

బి.కొత్తకోట, సెప్టెంబరు2: బి.కొత్తకోట మండలం బీరంగి పంచాయతీ పరిధిలో నిర్మితమైన పెయింటర్స్ కాలనీని బి.కొత్తకోట నగరపంచాయ తీ పరిధిలోనే కొనసాగించాలని ఆ కాలనీవాసులు, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎ దుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003లో టీడీపీ హయాంలో నిర్మించిన ఈ కాలనీలో అందరూ బి.కొత్తకోటకు చెందిన పెయింటర్లు, తాపీ మేస్త్రీలు ఉంటున్నారని, 15ఏళ్లుగా కాలనీకి మౌలికవసతుల కల్పన, ఇళ్లకు అసెస్మెంట్ నంబర్లు, విద్యుత్‌మీటర్లకు ఎన్వోసీలు ఇవ్వడం తోపాటు, ఇంటిపన్నులు సైతం నగరపంచా యతీ వారే వసూలుచేస్తూ వస్తున్నారన్నారు. ఇప్పుడు నిరాకరించి బీరంగి పంచాయతీ ద్వారా వసతులు పొందాలని చెప్పడం సమంజసంకాదన్నారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీధర్‌రావు, నగరపంచాయతీ కమిషనర్ పీఆర్ మనోహర్ లకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, ఏఐటీయూసీ నాయకులు అష్రఫ్‌అలీ, షమీవుల్లా, రఘునాథ్, చంద్రశేఖర్, రమేష్ లతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల్లో తేడా లేకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2: ఫ్రీహోల్డ్ భూముల్లో తేడా లేకుండా చూడాలని తహసీల్దార్ ఖాజాబీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూములను సక్రమంగా రీ వెరిఫికేషన్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ భూములు అక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు. సోమవారం గ్రీవెన్స్ డేకి వచ్చిన అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేసిన విషయాలను రెవెన్యూ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రెడ్డెప్ప, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, గ్రామవార్డు సచివాలయల సర్వేయుర్లు, తదితరులు పాల్గొన్నారు.